ఈనాడు
జోగులాంబ గద్వాల

మంగళవారం అక్టోబరు 1, 2024

ఊపిరి బిగపట్టుకోవాల్సిందే..!

గురుకులాల్లో సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్లు లేక అవస్థలు



నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కొండాపూర్‌లో తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయంలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్నారు. ఇక్కడ మొత్తం 650 మంది విద్యార్థులుండగా 24 స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉన్నాయి. నిబంధన ప్రకారం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 57 చొప్పున స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. దీంతో విద్యార్థులు ఉదయం సమయంలో ఆరుబయట కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కొందరు విద్యార్థులు బయటే స్నానం చేయాల్సి వస్తోంది.



నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లిలోని జ్యోతిరావు పులే బాలుర గురుకుల విద్యాలయంలో 5 నుంచి పదో తరగతి వరకు 480 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ 15 స్నానపు గదులు, 10 మరుగుదొడ్లు ఉన్నాయి. నిబంధనల ప్రకారం 56 చొప్పున స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. దీంతో విద్యార్థులు అవస్థలు వర్ణనాతీతం. ఇక్కడ ఓ షెడ్డులో గురుకుల విద్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో స్నానానికి, కాలకృత్యాలకు విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఈనాడు, మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలమూరులో మొత్తం 32 ఎస్సీ, 25 బీసీ, 20 మైనార్టీ, 19 గిరిజన గురుకుల విద్యాలయాలున్నాయి. ఈ గురుకులాల్లో సుమారు 52 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు గురుకులాల్లో సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్లు లేవు. నిబంధనల ప్రకారం ప్రతి 25 మందికి స్నానపు గదులు, 4 మరుగుదొడ్లు ఉండాలి. ఈ లెక్కన ఏ గురుకులాల్లోనూ ఇవిలేవు. ఉమ్మడి జిల్లాలో అన్ని గురుకులాల్లో కలిపి సుమారు 6,200 చొప్పున స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. ఇందులో సగం కూడా లేనట్లు అధికారుల రికార్డులు తెలుపుతున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలని...: ఇటీవల ఓ సామాజిక కార్యకర్త రాష్ట్రంలోని పలు గురుకులాల్లో సౌకర్యాలపై సర్వే నిర్వహించారు. దీని నివేదికను హైకోర్టుకు సమర్పించగా ప్రతి 10 మంది విద్యార్థులకు ఒక స్నానపు గది, ఏడుగురికి ఒక మరుగుదొడ్డి సౌకర్యం కల్పించి నివేదిక ఇవ్వాలని గురుకులాలను కోరింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం నాలుగు గురుకులాల్లో సర్వే నిర్వహించగా అందులో ఏ గురుకలాల్లోనూ నిబంధన ప్రకారం సౌకర్యాలు లేవు. కాలకృత్యాలు తీర్చుకొనేందుకు ఆరుబయటకు వెళ్లే క్రమంలో కొన్ని చోట్ల పాములు, ఇతర క్రిమికీటకాలతో ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు.



వనపర్తి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో మొత్తం 699 మంది చదువుతున్నారు. వీరికి 50 స్నానపు గదులు, 78 మరుగుదొడ్లు ఉన్నాయి. ఈ విద్యాలయంలో 83 చొప్పున స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. సరిపడా లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకోడానికి విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ముందుకు వస్తే ఎంతో మేలు..: గురుకులాల్లో మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేయాలంటే ప్రత్యేక నిధులు కావాలి. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ ఎస్సీ గురుకుల బాలికల విద్యాలయంలో మరుగుదొడ్ల సమస్య రావడంతో స్థానికంగా ఉన్న సంస్థ తరపున వాటికి మరమ్మతులు చేపట్టారు. కొత్తగా ఏర్పాటు చేయడానికి కూడా ముందుకొచ్చారు. అవసరమైన చోట గురుకులాల్లో స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి మౌలిక సదుపాయాలు కల్పిస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.



సుంకేసుల నుంచి విడుదలవుతున్న వరద నీరు

సుంకేసులకు కొనసాగుతున్న వరద

రాజోలి : రాజోలి శివారు సుంకేసుల జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం ఎగువ నుంచి 11,300 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో రెండు గేట్లను 1మీటరు మేర ఎత్తి 8,800 క్యూసెక్కులను దిగువ శ్రీశైలం జలాశయానికి 2,400 క్యూసెక్కులను కేసీ కాలువకు విడుదల చేస్తున్నట్లుగా జేఈ రాజు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 291.90 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లుగా ఆయన పేర్కొన్నారు.

నిరీక్షణకు తెర

డీఎస్సీ ఫలితాలు విడుదల ● నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన



విద్య శాఖ సంచాలకుల ఆదేశాలను నమోదు చేసుకుంటున్న డీఈవో రవీందర్, అధికారులు

పాలమూరు, గద్వాల అర్బన్, అచ్చంపేట, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ ఎంపిక రాత పరీక్ష (డీఎస్సీ) ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మెరుగైన మార్కులు, ర్యాంకులు సాధించిన అభ్యర్థుల ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలను నేటి నుంచి 5వ తేదీ వరకు పరిశీలించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ సంచాలకుల ఉత్తర్వులు జారీ చేశారు. 2024 డీఎస్సీలో ఉమ్మడి జిల్లాలో 1,131 పోస్టులను ప్రభుత్వం ప్రకటించింది. రెండు నెలల క్రితం 20 రోజుల పాటు రాతపరీక్షలు నిర్వహించారు. టెట్‌లో 20, డీఎస్సీ రాత పరీక్షలో 80 చొప్పున మొత్తం 100 మార్కులు ఉంటాయి. ఇందులో ఎక్కువ మార్కులు పొందిన వారికి మాత్రమే పోస్టులు రానున్నాయి. ఎస్జీటీ పోస్టులు కొంతమేరకు ఉన్నా.. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కొన్ని సబ్జెక్టుల్లో కేవలం ఒకటి, రెండు మాత్రమే ఉన్నాయి. ఒక్కో ఉపాధ్యాయ పోస్టుకు ముగ్గురు అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపిక చేశారు. ప్రస్తుతం ఉన్న ఖాళీలను రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్ ఆధారంగా భర్తీ చేయనున్నారు. ఎంపికైన అభ్యర్థుల చరవాణి నంబరుకు ఎస్ఎంఎస్ లేదా మెయిల్ ఐడీ ద్వారా సమాచారం అందించనున్నారు. ఎంపికైన అభ్యర్థుల్లో ధ్రువపత్రాల పరిశీలనకు ఏ తేదీన హాజరు కావాలో సమాచారం ఇవ్వనున్నారు.

డీఈవో అధికారిక వెబ్‌సైట్లలో కూడా 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల జాబితాను అందుబాటులో ఉంచుతున్నారు. అక్టోబరు 2 నుంచి పాఠశాలలకు దసరా సెలవులు ఇస్తున్నారు. పాఠశాలలు సెలవుల తర్వాత 15న ప్రారంభం కానున్నాయి. సెలవుల్లోనే ధ్రువపత్రాలను పరిశీలించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి ఉపాధ్యాయులను నియామక పత్రాలు అందజేయనున్నారు. సెలవుల తర్వాత పాఠశాలల్లో కొత్త ఉపాధ్యాయులు పాఠాలు బోధించనున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 2వేల మంది ఎస్జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతి కల్పించడంతో చాలా చోట్ల ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. డీఎస్సీ ద్వారా ఖాళీలను భర్తీ చేయనుండటంతో ఉపాధ్యాయుల కొరత చాలా వరకు తీరనుంది. విద్యావ్యవస్థ గాడినపడనుంది.

జిల్లాల వారీగా ఇలా పోటీ

మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్జీటీ విభాగంలో 105 పోస్టులకు స్థానిక సంస్థల పాఠశాలల్లో ఉండగా 2,979 మంది పరీక్ష రాశారు. స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్రానికి 7 పోస్టులు ఉంటే 763 మంది పరీక్ష రాశారు. ఎస్జీటీలో తుపిలి శివసాయి అనే అభ్యర్థి 84 మార్కులు తెచ్చుకొని జిల్లాలోనే ప్రథమ ర్యాంకు సాధించాడు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 111 ఎస్జీటీ పోస్టులకు 3,418 (ఒక్కదానికి 31) మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. సౌమ్య ఎస్జీటీ ఫలితాల్లో 84.90 మార్కులతో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించారు. నారాయణపేట జిల్లాలో తెలుగు విభాగంలో 127 ఎస్జీటీ పోస్టులకు 2,608 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ప్రియాంక 87.37 మార్కులతో జిల్లాలో మొదటి ర్యాంకును సాధించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎస్జీటీ విభాగంలో అత్యధిక మార్కులు ఈమె సాధించడం విశేషం. జోగులాంబ గద్వాల జిల్లాలో తెలుగు మాధ్యమంలో 60 పోస్టులకు 2,694 మంది పరీక్ష రాశారు.

ఉమ్మడి జిల్లాలో పోస్టులు, అభ్యర్థుల పరిస్థితి..

జిల్లా	మొత్తం అభ్యర్థులు	మొత్తం పోస్టులు	1:3 అభ్యర్థులు
నాగర్‌కర్నూల్	10,072	285	855
మహబూబ్‌నగర్	7,521	243	729
నారాయణపేట	5,972	279	837
గద్వాల	6,474	172	516
వనపర్తి	2,137	152	456

ఎంపికైన అభ్యర్థులు నేటి నుంచి గద్వాలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ధ్రువపత్రాల పరిశీలనకు ఉంటుంది. పరిశీలనకు వచ్చే అభ్యర్థులు వెంట అన్ని ఒరిజినల్ అర్హత ధ్రువపత్రాలను తీసుకొని రావాలి. 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులను వివరాలను www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచాం.

-జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్

రైతేరాజు 8 లో..

దసరాకు 649 ప్రత్యేక బస్సులు

నేటి నుంచి అందుబాటులోకి సర్వీసులు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : దసరా పండగ నేపథ్యంలో ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలోని డిపోల నుంచి ఈ నెల 1 నుంచి 11వ తేదీ వరకు 649 ప్రత్యేక బస్సులు నడిపేందుకు నిర్ణయించారు. నగరాల్లో స్థిరపడిన వారు దసరా పండగ కుటుంబ సభ్యులతో కలిసి చేసుకునేందుకు పల్లెలకు తరలివస్తారు. ఈ నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా హైదరాబాద్‌కు బస్సులు నడపనున్నారు. అచ్చంపేట-105, వనపర్తి-95, గద్వాల-89, మహబూబ్‌నగర్-69, కల్వకుర్తి-67, షాద్‌నగర్-59, కొల్లాపూర్-58, నారాయణపేట-54, నాగర్‌కర్నూల్-53 బస్సులను నడపనున్నట్లు ఆర్ఎం శ్రీదేవి తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో 25 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్లు చెప్పారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, షాద్‌నగర్, కొత్తకోట, పెబ్బేరు, మక్తల్, కోస్గి, అయిజ, ఆమన్‌గల్, తెలకపల్లి, డిండి, బిజినేపల్లి, మద్దూర్, మరికల్, గణపూర్ బస్టాండ్ల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు.




తగ్గిన దిగుబడి.. పెరిగిన దిగుమతి

భారంగా మారిన ఉల్లి ధరల పెరుగుదల



దేవరకద్రలో ఉల్లిని విక్రయిస్తున్న రైతులు



న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ వ్యవసాయం, దేవరకద్ర గ్రామీణం : ఏ కూర వండాలన్నా ఉల్లి ఉండాల్సిందే.. ఆ ఉల్లి ధరలే పెరిగిపోవటం సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ఇబ్బందికరంగా మారింది. గతేడాది ఉల్లి సాగు చేసిన రైతులు మార్కెట్లో సరైన ధరలు లేక తక్కువ ధరలకు అమ్ముకున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకున్న రైతులు ఈసారి పెద్దగా సాగు చేయలేకపోయారు. వర్షాలు ఆలస్యం కావటం కూడా ఇందుకు కారణం. ఫలితంగా ఉల్లిపంట కొరత ఏర్పడి ధర పెరిగిపోతోంది.

వర్షాలతో దెబ్బతిన్న పంట : వీపనగండ్ల, తిమ్మాజిపేట, వనపర్తి, పెబ్బేరు, ఊట్కూర్, నారాయణపేట, మక్తల్, నవాబుపేట, బాలానగర్, కల్వకుర్తి, ఊర్కొండపేట, మిడ్జిల్, బిజినేపల్లి, గండీడ్, మహమ్మదాబాద్ తదితర మండలాల్లో ఉల్లిని ఎక్కువగా సాగు చేస్తారు. ఉమ్మడి జిల్లాలో 3,600 ఎకరాల్లో సాగయ్యే ఉల్లి పంట ఈసారి 1,200 ఎకరాలకు పడిపోయింది. ఇటీవలి వర్షాలతో ఉమ్మడి జిల్లాలో సాగు చేసిన కొద్దిపాటి ఉల్లిపంట కూడా దెబ్బతింది. ఈ నేపథ్యంలో మూడు నెలలుగా ఉల్లి ధరలు పెరుగుతూ వచ్చాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో వర్షాకాలంలో 52 ఎకరాలు, జోగులాంబ గద్వాల జిల్లాలో 87 ఎకరాల్లోపే ఉల్లి సాగైంది. వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 2,800 ఎకరాల్లో ఉల్లి సాగయ్యేది. ఈసారి 971 ఎకరాల్లోపే సాగైంది. నారాయణపేట జిల్లాలో 340 ఎకరాలకుగాను 86 ఎకరాల్లో సాగైంది.

వర్షాలతో పంట దెబ్బతినటంతో కర్నూలు, నందికొట్కూరు, మంత్రాలయం, అనంతపురం వంటి ప్రాంతాల నుంచి ఉమ్మడి జిల్లాకు ఉల్లి రాలేదు. ఈ పరిస్థితుల్లో వ్యాపారులు మహారాష్ట్రలోని నాసిక్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక నుంచి ఉల్లిని దిగుమతి చేసుకోవటంతో ధర మూడింతలు పెరిగింది. క్వింటా ఉల్లి ధర జులైలో రూ.2,000 ఉండగా.. సెప్టెంబరులో రూ.5,600లకు పెరిగింది. కిలో ఉల్లి ధర జులైలో రూ.15 నుంచి రూ.20 ఉండగా.. ఇప్పుడు రూ.60కి పెరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా ఉద్యాన అధికారి కె.వేణుగోపాల్‌ని 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సాగు తగ్గటం, వర్షాలతో పంట దెబ్బతినటమే ధరల పెరుగుదలకు కారణమన్నారు. యాసంగిలో పంట సాగు పెరిగి ధరలు తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు.



భారంగా మారింది.. : ఏ కూర వండలన్నా ఉల్లి తప్పనిసరి. పెరిగిన ఉల్లి ధరలు మాకు భారంగా మారాయి. వారానికి 3 కిలోల వరకు ఉల్లి వినియోగిస్తాం. పెరిగిన ఉల్లి ధరలతో కొనుగోలు చేయలేకపోతున్నాం. ఉల్లి ధరలను నియంత్రించి సామాన్యులకు అందుబాటులో ఉంచాలి.

- సంధ్యారాణి, మహిళ, గూరకొండ



రైతుకు లాభం లేదు.. : మార్కెట్‌లో ఉల్లి కిలో రూ.60కి విక్రయిస్తున్నారు. రైతులు మార్కెట్‌కు పంట తీసుకెళ్తే క్వింటాకు రూ.2,500 నుంచి రూ.3,500 వరకే ఇస్తున్నారు. పేరుకే ఒకరిద్దరు రైతులకు రూ.5వేల చొప్పున చెల్లిస్తున్నారు. పెరిగిన ధర రైతులకు కూడా చెల్లించాలి.

- భగవంతు, రైతు, దేవరకద్ర

ప్రజావాణి వినతులకు ప్రాధాన్యమివ్వండి



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతివారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అధికారులు ప్రజావాణి అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. సోమవారం ఐడీవోసీలోని సమావేశం హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ బాధితుల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించడానికి గాను సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించడానికి అధికారులు ప్రత్యేకంగా చొరవ చూపాలన్నారు. ప్రజావాణికి 42 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు శ్రీనివాసరావు, నర్సింగ్‌రావు, ఆర్డీవో రాంచందర్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి: రేషన్ డీలర్లకు ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని జిల్లా రేషన్ డీలర్లు సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. డీలర్లకు గౌరవవేతనం ఇస్తామని, క్వింటాకు రూ.300 కమీషన్ పెంచుతామని, ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద ఎలక్ట్రానిక్ వే‌బ్రిడ్జి ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారని పేర్కొన్నారు. డీలర్లకు రూ.10లక్షల విలువైన బీమా సౌకర్యంతో పాటు, హమాలి దిగుమతి ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని, డీలరు చనిపోతే దహన సంస్కారాలకు రూ.50వేలు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.



సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న రేషన్ డీలర్లు

అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ బాధ్యతల స్వీకరణ



గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్‌గా లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం జిల్లా కేంద్రానికి చేరుకున్న ఆయన కలెక్టర్ సంతోష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అనంతరం ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీలో భూసేకరణ ప్రత్యేక కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం రెవెన్యూ విభాగానికి సంబంధించి రెగ్యూలర్ అదనపు కలెక్టర్‌గా బదిలీ చేసింది. ప్రస్తుతం ఈ బాధ్యతలను జిల్లా భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు ఇన్‌ఛార్జిగా నిర్వహిస్తున్నారు.

వాస్తవ పరిశీలనలతో పరిష్కార చర్యలు: ఎస్పీ

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: బాధితులు చేసే ఫిర్యాదులపై వాస్తవ పరిశీలన చేసి పరిష్కార చర్యలు తీసుకోవాలని ఎస్పీ శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. గద్వాలలోని జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పలువురు బాధితులు సమస్యలపై ఫిర్యాదు చేశారు. బాధితులతో ఎస్పీ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే బాధితులతో పోలీసు సిబ్బంది గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజావాణిలో 11 ఫిర్యాదులు నమోదైనట్లు ఎస్పీ చెప్పారు. వాటిలో భూ వివాదాలు 6, ప్లాట్ కబ్జా 2, ఇతర అంశాలకు సంబంధించి 3 ఫిర్యాదులు ఉన్నాయని తెలిపారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

నేరస్థులకు శిక్ష పడేలా చర్యలు..

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: సెషన్స్ కోర్టు పరిధిలో ట్రయల్ నడిచే పోక్సో, అత్యాచారం, హత్య తదితర కేసులను లక్ష్యంగా పెట్టుకుని నేరస్థులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశించారు. గద్వాలలోని జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో సోమవారం కోర్టు విధులు నిర్వహించే పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. న్యాయాధికారుల సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. నేరస్థుల శిక్ష పెంచి పోలీసు శాఖపై ప్రజల్లో పూర్తి నమ్మకం కలిగించాలని వివరించారు. ప్రతి రోజు కోర్టుకు వెళ్లాలని తెలిపారు. ఛార్జిషీట్ అయిన కేసుల్లో సీసీ నంబర్లు పొందాలని చెప్పారు. గ్రేవ్ కేసులు అక్విట్ అయితే పై కోర్టుకు అప్పీల్ చేయాలని సూచించారు. డీసీఆర్బీ ఎస్సై రజిత, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

అయిజ, న్యూస్‌టుడే : గద్వాలలో నిర్వహించిన తైక్వాండో జోనల్ స్థాయి పోటీలకు అయిజ పట్టణంలో విద్యార్థులను సోమవారం ఉదయం ఎంపిక చేశారు. పట్టణంలోని మార్కెట్‌యార్డ్ మైదానంలో తైక్వాండో విద్యార్థులకు పోటీపరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులు కిరణ్, హర్ష, రోహిత్, వీరేశ్‌లు జోనల్ స్థాయికి ఎంపికైనట్లు మాస్టర్ సుధీర్‌కుమార్ తెలిపారు.



ఎంపికైన విద్యార్థులతో శిక్షకులు

తుంగభద్ర నదిలో 7,952 క్యూసెక్కుల ప్రవాహం

శాంతినగర్, న్యూస్‌టుడే : తుంగభద్ర నదిలో 7,952 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 8.9 అడుగుల ఎత్తులో నీట ప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధాన కాల్వకు 8.2 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, మన రాష్ట్రానికి వచ్చే సరికి 5 అడుగులుగా ఉంది.

ఇక లెక్క తేలుస్తారు..

గ్రామపంచాయతీల్లో డిసెంబరు నాటికి ఆడిట్ పూర్తి

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ ఆడిట్ ప్రారంభమైంది. ఆయా పంచాయతీల ఆదాయ, వ్యయాలపై అధికారులు లెక్కలు తీస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో పంచాయతీలు చేసిన ఖర్చులు, వాటికి సంబంధించిన బిల్లులు, ఓచర్లు సరిగ్గా ఉన్నాయో, లేవో అనే అంశాలను జిల్లా ఆడిట్ శాఖ అధికారుల బృందాలు పరిశీలిస్తున్నాయి. ఇప్పటి వరకు అలంపూర్, వడ్డేపల్లి పురపాలక సంఘాలు, 12 మండలాలు, మార్కెటింగ్ శాఖలో ఆడిట్ పూర్తి చేశారు. ప్రస్తుతం జిల్లాలో 255 పంచాయతీల్లో ఆడిట్ నిర్వహిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం నవంబర్ చివరి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. పూర్తిస్థాయిలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ విభాగాల ఆడిట్‌ను డిసెంబర్ 31 నాటికి పూర్తి చేస్తారు. వ్యయాలపై అభ్యంతరాలు ఉంటే వాటిని పరిష్కరించడానికి కొంత సమయం ఇచ్చిన అనంతరం తుది నివేదికను మార్చిలో ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు.

గతానికి భిన్నంగా ఆడిట్.. : గతంలో మాన్యువల్‌గా జరిగిన ఆడిట్ ప్రక్రియ మూడేళ్ల నుంచి ఆన్‌లైన్‌లో చేపడుతున్నారు. పంచాయతీల రికార్డులను సరిచూసిన అనంతరం వాటిని నేరుగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇలా వివరాలను నమోదు చేసిన తరువాత వాటిని తిరిగి సవరించేందుకు అవకాశాలు లేకపోవడంతో ఆడిట్‌లో ఎలాంటి తప్పులకు తావులేకుండా జాగ్రత్తగా వివరాలను పరిశీలించి నమోదు చేస్తున్నారు. ఈ ఆన్‌లైన్ ఆడిట్ చిన్న పంచాయతీల్లో రెండు రోజుల్లో, పెద్ద పంచాయతీల్లో నాలుగు రోజుల సమయం పడుతోందని ఆడిట్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.



గ్రామ పంచాయతీ భవనం

● పంచాయతీల్లో ఆన్‌లైన్ ఆడిటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ నవంబర్ నాటికి ముగించాల్సి ఉంది. కొన్ని సందర్భాల్లో అభ్యంతరాలు వ్యక్తమవుతుంటాయి. అన్నింటిని సవరించి డిసెంబర్ నాటికి పూర్తి స్థాయిలో అన్ని ప్రభుత్వ విభాగాల్లో ఆడిటింగ్ పూర్తి చేయాడానికి అధికారులు పనిచేస్తున్నారు.

- భీమ్లానాయక్, జిల్లా ఆడిట్ అధికారి

ఆడిట్ ఎందుకు.. : గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాల కింద, ఆర్థిక సంఘాలు నిధులు మంజూరు చేస్తాయి. ఇవి కాకుండా ప్రజల నుంచి నేరుగా వివిధ రకాల పన్నుల రూపంలో నిధులు సమకూర్చుకుంటాయి. ఈ నిధులను పాలక వర్గాలు సక్రమంగా నిబంధనల ప్రకారం వ్యయం చేస్తున్నాయా? అవి నీతికి పాల్పడుతున్నాయా? అనే విషయాలను నిగ్గు తేల్చడానికి ఏటా ఆడిట్ నిర్వహిస్తారు. వ్యయాలకు సంబంధించిన బిల్లులను సరిచూసి వాటిపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తే, సదరు పనికి సంబంధించి వినియోగించిన వ్యయాన్ని తిరిగి పంచాయతీల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. ఏటా నిర్వహించే ఆడిట్ కోసం ముందుగానే జిల్లాస్థాయిలో ప్రణాళికలు తయారు చేసిన తర్వాత ఏ రోజు ఏ ప్రభుత్వ విభాగంలో ఆడిట్‌ను నిర్వహిస్తారో ముందుగానే ఆయా ప్రభుత్వ విభాగాల ఆడిట్ అధికారులు సమాచారం అందిస్తారు. కార్యదర్శులు ఆడిట్ సమయం వచ్చే నాటికి అన్ని రికార్డులను సిద్ధం చేసి ఉంచాలి. అనివార్య కారణాలతో అనుకున్న సమయానికి ఆడిట్ నిర్వహించకుంటే తరువాత తేదీని వారికి కేటాయిస్తారు. జిల్లాలో బృందాలుగా ఆడిట్ అధికారులు రికార్డులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది.


అద్దె చెల్లించడం లేదని గురుకుల పాఠశాలకు తాళం



గేటుకు తాళం వేసి పాఠశాల ఎదుట నిల్చున్న భవనం యజమాని

ఇటిక్యాల, న్యూస్‌టుడే : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు అద్దె చెల్లించడం లేదంటూ భవనం యజమాని గేటుకు తాళం వేసిన ఘటన ఎర్రవల్లి మండలంలో చోటుచేసుకుంది. 10 నెలలుగా అద్దె చెల్లించలేదని అడిగిన ప్రతిసారి రెండు మూడు రోజుల్లో చెల్లిస్తామంటూ గురుకుల అధికారులు కాలం గడుపుతున్నారని ఆరోపించారు. దీంతో సోమవారం ఉదయం ఉపాధ్యాయులు పాఠశాలలోకి వెళ్లకుండా గేటుకు తాళం వేశారు. ఈ విషయంపై ఉపాధ్యాయులు జోనల్ అధికారి రజిని దృష్టికి తీసుకెళ్లగా భవనం యజమానితో చరవాణిలో మాట్లాడారు. బిల్లులు ప్రభుత్వానికి సమర్పించామని రెండు రోజులలో చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో తాళం తీశారు.

ఆకుకూర.. తనివితీరా!



- చవగ్గా అందుబాటులో పోషకాహారం
- నేడు శాకాహార దినోత్సవం

పాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లలో కొవ్వులేక పోవడం వలన గుండె జబ్బులు దరిచేరవు. ఆకుకూరలు, కూరగాయల్లోని యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ వంటి ప్రమాదకర రోగాలు దరిచేరని వ్వవని సర్వేలు చెబుతున్నాయి. శాకాహారంలో ఆకుకూరలకు ప్రాధాన్యం ఉండటమే కాకుండా ఎలాంటి ఖర్చులేకుండా ఇంటి పరిసరాల్లోనూ పండించుకోవచ్చు.

- న్యూస్‌టుడే, బిజినేపల్లి

తొలిసారి 1977లో.. పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడేదిశగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఏటా అక్టోబర్ 1న ప్రపంచ శాకాహార దినోత్సవాన్ని జరుపుకొంటారు. తొలిసారి 1977లో అమెరికాలో నిర్వహించారు. శాకాహార ప్రాముఖ్యత, విలువలను ప్రపంచానికి వివరించేందుకు ఇప్పటివరకు వందలాది సదస్సులను నిర్వహించారు.

అందుబాటులో ఆరోగ్యం: భారతదేశంలో అనాదిగా శాకాహారానికి ఉన్న ప్రాధాన్యం గొప్పది. అందరికీ అందుబాటులో ఉండేలా ప్రకృతి ఇచ్చిన వరం ఆకుకూరలు. రోజూ ఏదో ఒక ఆకుకూరను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యం కోసం రూ. వేలు ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉండదు. జీవన శైలిని మార్చే సత్తా ఆకుకూరలకు ఉందని ఆయుర్వేద నిపుణులు పేర్కొంటున్నారు. ఆకుకూరల్లో తక్కువ కొవ్వు ఉండటం, అధిక ప్రొటీన్లు, ఖనిజలవణాలు అధికం. పెరడు, ఇంటి మిద్దెలపై ఖాళీ డబ్బాలు, కుండీలను వినియోగించి ఇంటికి కావాల్సిన తాజా ఆకుకూరలను పండించుకోవచ్చు.

తోటకూర : ఆకుకూరల్లో ఎక్కువమంది ఇష్టపడే తోటకూరలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలతో పాటూ, అనేక పోషకాలున్నాయి. తోటకూరను ఆహారంగా తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. క్యాన్సర్‌ని నిరోధిస్తుంది. త్వరగా జీర్ణమవడంతో పాటూ, జలుబు, జ్వరం వంటి చిన్న రోగాల బారిన పడకుండా కాపాడుతుంది. విత్తిన నాటి నుంచి 25 నుంచి 30 రోజుల్లోపు కోతకు వస్తుంది.

కంటి చూపునకు పొన్నగంటి కూర : పొన్నగంటి కూర శరీరానికి చలువ చేస్తుంది. కంటి చూపు సమస్యతో బాధ పడేవారికి పొన్నగంటి కూర చాలా మేలు చేస్తుంది. నిత్యం ఆహారంలో తీసుకోవడం వలన కంటి చూపు మెరుగుపడుతుంది. పొన్నగంటి కూర సహజసిద్ధంగా పొలం గట్లపై వర్షాకాలంలో లభిస్తుంది.

గోంగూర (పుంటి కూర) : గోంగూరతో చాలా లాభాలున్నాయి. తినడానికి కాస్త పుల్లగా అనిపించినా.. గోంగూర తరుచూ తినడం వలన రక్తహీనత సమస్య దరిచేరదు. గుండెకు బలం చేకూరుతుంది. గోంగూరను బాగా ఉడకబెట్టి పుండ్లపై కడితే అవి త్వరగా మానుతాయి. గోంగూర నిల్వ పచ్చడిగా వినియోగించుకోవచ్చు. విత్తిన నాటి నుంచి 15 నుంచి 20 రోజుల్లోగా గోంగూర ఆకులను ఆహారంగా తీసుకోవచ్చు.

బచ్చలి కూర : బచ్చలికూర గ్రామాల్లో విరివిగా లభిస్తుంది. ఆహారంలో తరచూ వాడటం వలన ఒంట్లో వేడి క్రమేపి తగ్గుతుంది. మూత్రంలో మంట, ఇన్‌ఫెక్షన్లపై ప్రభావం చూపుతుంది. బచ్చలి కూరను కూడా కుండీలు, ఇంటి ఆవరణలో సులభంగా పెంచుకోవచ్చు. నాటిన 30 నుంచి 35 రోజుల వ్యవధిలో కోతకు వస్తుంది.

పాల కూర : పాలకూరకు రక్తాన్ని శుద్ధి చేసే తత్వం ఉంటుంది. పాలకూరలో విటమిన్ సి, ఏ, మెగ్నీషియం, ఫోలిక్ యాసిడ్ వంటివి క్యాన్సర్ వంటి వ్యాధులను నివారించడంలో తోడ్పడతాయి. ముఖ్యంగా ఊపిరితిత్తులు, రొమ్ము క్యాన్సర్‌ను అదుపుచేయడంలో పాలకూర ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఈ ఆకుకూర వాత, పిత్త, కఫ దోషాలను నివారిస్తుంది. విత్తనం నాటిన 20 -25 రోజుల నుంచి పాలకూరను ఆహారంగా వినియోగించవచ్చు.

అందుబాటులో అధిక పోషకాలు.. : సహజసిద్ధంగా పంట పొలాల్లో పెరిగే జొన్నచెంచలి, గొగ్గలి, ఎల్కచెవులకూర, తగరించ, పాయలాకు, తలైలా, గుప్తరేణి, గునుగు, తుమ్మి, పొన్నగంటి, నల్లకాశ, తెల్లకాశ, బుడ్డకాశ, గోరుమాడి, సన్నపాయల, తెల్లగజ్జల, చెన్నంగి, యెన్నాద్రి, అడవి సోయకూర, చిత్రమాళ, అంగిబింగి, అడవి పుల్లకూర, బంకటి పూర, నల్లనేల ఉసిరి, ముల్లుదొగ్గలి, పులపత్రం, గంగవాయిలి వంటి సహజంగా లభించే ఆకుకూరలను ప్రజలు ఆహారంగా తీసుకోవడం లేదు. వాణిజ్యంగా సాగు చేసిన ఆకుకూరలతో పోలిస్తే వీటిలో అధిక మొత్తంలో సూక్ష్మ పోషకాలు, ప్రొటీన్లు ఉన్నాయి. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ, కేవీకే ఆధ్వర్యంలో ప్రకృతిలో లభించే ఆకుకూరలపై అవగాహన కల్పిస్తున్నాం.



- హేమలత, గృహ విజ్ఞానశాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, జహీరాబాద్

పెరట్లోనే కూరగాయలు..: 30 ఏళ్లుగా పెరటి తోటల పెంపకం ద్వారానే కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నాను. నిత్యం తీసుకునే ఆహారంలో ఏదో ఒక ఆకుకూర తీసుకోవడం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తవు. ఇంటి బయట ఖాళీ స్థలం లేని వారు, మిద్దెపై కుండీల్లోనూ కూరగాయలు, ఆకుకూరలు సాగుచేసుకోవచ్చు.

- శారద, విశ్రాంత ఉపాధ్యాయిని, పాలెం



పెరటితోట సాగులో విశ్రాంత ఉపాధ్యాయురాలు శారద

ఉమ్మడి జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం ఇలా..

జిల్లా	కూరగాయల సాగు	ఉత్పత్తి (సుమారు టన్నుల్లో)
నారాయణపేట	2,217	26,075
మహబూబ్‌నగర్	1,986	18,795
జోగులాంబ గద్వాల	4,585	52,350
నాగర్‌కర్నూల్	1,890	20,892
వనపర్తి	1,719	19,780

పొగాకు నారు మడి.. అధిక రాబడి

మల్దకల్, న్యూస్‌టుడే : సంప్రదాయ పంటలు సాగుచేసి ఆశించిన స్థాయిలో దిగుబడి దక్కక, గిట్టుబాటు ధరలు లభించక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న ఓ రైతు మిత్రుడి సలహాతో పొగాకు నారు సాగు చేసి లాభాల బాటలో పయనిస్తున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం తాటికుంటకు చెందిన పెద్ద తిమ్మోతి 30 గుంటల్లో పొగాకు నారు పెంపకం చేపట్టారు. పొడవు 40 అడుగులు, వెడల్పు మూడు అడుగుల ప్రకారం 150 బెడ్లు ఏర్పాటు చేసుకుని జులై చివరి వారంలో విత్తనాలు చల్లారు. అంతకు ముందు పొలంలో రెండు ట్రాక్టర్ల పశువుల ఎరువుతో పాటు సేంద్రియ ఎరువు వేసి కలియదున్నారు. బిందు సేద్యం పరికరాలతో నీటితడులు అందించారు.

రైతేరాజు



నారుమడిలో కలుపు తీస్తున్న రైతు పెద్దతిమ్మోతి

55 నుంచి 60 రోజుల వరకు పొలంలో నాటడానికి అనుకూలంగా ఉండటంతో వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు ఇక్కడికే వచ్చి నారు తీసుకెళ్తున్నారు. విత్తనాలు, ఎరువులు, కూలీలు, బెడ్ల తయారీ, ఇతరత్రా అవసరాలకు రూ.1.10 లక్షలు వరకు ఖర్చయినట్లు రైతు తెలిపారు. 120 బెడ్ల నారు విక్రయించగా రూ.2.50 లక్షలు వచ్చాయన్నారు. రూ.1.40 లక్షలు ఆదాయం పొందినట్లు పేర్కొన్నారు. ఇంకా 30 బెడ్ల నారు ఉందని తెలిపారు.

పొలం వద్దే కొనుగోళ్లు: పొగాకు బెడ్లలో కలుపు నివారణకు కూలీలు అవసరం. కలుపు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నా. కర్ణాటకతో పాటు గట్టు, ఇటిక్యాల, గద్వాల మండలాలకు చెందిన రైతులు పొలం వద్దకే వచ్చి నారు కొనుగోలు చేస్తున్నారు. ఆరేళ్లుగా నారు పెంచి విక్రయిస్తున్నా. ఈఏడాది అనుకూలంగా వర్షాలు కురిశాయి. మంచి గిరాకీతో పాటు ధర అధికంగా పలికి లాభాలు వచ్చాయి.

- పెద్దతిమ్మోతి రైతు, తాటికుంట, మల్దకల్‌మండలం

ప్రశ్నలు - సమాధానాలు

? వరి ఆకునల్లి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?
- కృష్ణయ్య, దంతనూర్

✔ గంధకం 3 గ్రాములు లేదా ఫొపర్‌గేట్ 2 మి.లీ లేదా స్పైరోమెసిఫెన్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

? టమాటాలో సూదిపురుగు (ఫిన్‌వార్మ్) నివారణకు చర్యలు తెలపండి.
- రామకృష్ణ, మున్ననూర్

✔ లీటరు నీటిలో ఇండాక్సీకార్బ్ 1.75 మి.లీ లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ లేదా డెల్టామిత్రిన్ 1 మి.లీ లేదా ల్యామ్డా సైహలోత్రిన్ 1 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.

? కందిలో మారుక గూడుపురుగు నివారణకు ఎలాంటి మందులు వాడాలి?
- స్వామి, చెన్నారం

✔ నివారణకు వేపమందు (1500పీపీఎం) 5 మి.లీ, న్యూవులురాన్ 1 మి.లీ లేదా క్లోరాంట్రీనిపోల్ 0.3 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



- డాక్టర్ రాజేందర్‌రెడ్డి, కీటక శాస్త్రవేత్త, కేవీకే మదనాపురం
- న్యూస్‌టుడే, మదనాపురం

సాగులో.. సమస్యలా?

మదనాపురం : సాగులో యాజమాన్య పద్ధతులపై అన్నదాతలు ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య చరవాణి నం : 94408 35658కి ఫోన్ చేస్తే సందేహాలను నివృత్తి చేస్తామని కేవీకే కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

వేరుసెనగలో సస్యరక్షణ పాటిస్తే దిగుబడులు

మదనాపురం, న్యూస్‌టుడే : యాసంగిలో సాగుచేసే వేరుసెనగలో కలుపు, చీడపీడల నివారణకు సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్ రెడ్డి తెలిపారు. టీఏజీ 24, కదిరి 6, కదిరి 9, లేపాక్షి, హరితాంధ్ర, ధరణి, జేఎల్ 24, జగిత్యాల పల్లీ 1, టీసీజీఎస్ 1694 అనువైన రకాలని పేర్కొన్నారు.



సాగు చేసిన వేరుసెనగ

విత్తనశుద్ధి : విత్తనాన్ని టెబ్యూకోనోజోల్ 2డీఎస్ మందును ఒక గ్రాము లేదా మ్యాంకోజెబ్ 3 గ్రాములు కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి మొదట చేసుకుని ఆపైన ట్రైకోడర్మా 10 గ్రాములు, రైజోబియం 5 గ్రాములు విత్తనం వేసే 2 గంటల ముందు కలుపుకొని విత్తుకోవాలి.

పోషకాల యాజమాన్యం : భాస్వరం, పొటాష్ ఎరువులు విత్తే సమయంలోనే వేయాలి. ఎకరానికి 100 కిలోల సూపర్‌ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 18 కిలోల యూరియాను విత్తే సమయంలో వేయాలి. పంట పూత, ఊడలు దిగే సమయంలో 200 కిలోల జిప్సం మొదళ్ల దగ్గర వేయాలి. విత్తిన 30 రోజుల తర్వాత తొలిపూత దశలో ఎకరానికి 10 లేదా 12 కిలోల యూరియా వేసుకోవాలి.

కలుపు నివారణకు..: విత్తిన వెంటనే లేదా 2 రోజుల లోపల కలుపు నివారణకు అలాక్లోర్ ఒక లీటరు లేదా పెండిమిథాలిన్ 1.3 లీటరును ఎకరానికి 200 లీటర్ల నీటికి కలిపి నేలపై పిచికారీ చేసుకోవాలి. గడ్డిజాతి మొక్కలు అధికంగా ఉంటే క్విజలోఫాప్.పి.ఇథైల్ ఎకరాకు 400 మి.లీ లేదా ప్రొపాక్విజఫాస్.పి.ఇథైల్ ఎకరాకు 250 మి.లీ విత్తిన 20 రోజుల వరకు పిచికారీ చేసుకోవచ్చు.

చీడపీడల యాజమాన్యం : రసం పీల్చే పురుగు నివారణకు ప్రిపోనిల్ 2 మి.లీ లేదా థయోమిదాక్సామ్ 0.4 గ్రాములు లేదా ఇమిడాక్లోఫిడ్ 0.3 మి.లీ లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొగాకు లద్దెపురుగు నివారణకు మొదటిదశలో 5 మి.లీ వేపమందు (ఎన్ఎస్‌కేఈ)ను క్లోరోఫైరిఫాస్ 50ఈసీ 1.5 మి.లీ లేదా న్యూవులురాన్ 1 మి.లీ లేదా ఫ్లూబైండమైడ్ 0.2 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాముల మందు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మంత్రులకు దసరా ఉత్సవాల ఆహ్వానం



మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆహ్వానం పలుకుతున్న ఈవో పురేందర్, అర్చకుడు ఆనంద్‌శర్మ

అలంపూర్,న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు అలంపూర్ ఆలయాల్లో ఉత్సవాలకు హాజరవ్వాలని మంత్రులకు ఆహ్వానం పలికారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మంత్రులు రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ డీకే అరుణకు ఈవో పురేందర్, ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ ఆహ్వాన పత్రికలను అందజేశారు.

విద్యుదుత్పత్తికి 37,115 క్యూసెక్కుల నీరు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టు వద్ద 68 వేల క్యూసెక్కుల వరద ఉద్ధృతి కొనసాగుతున్న నేపథ్యంలో విద్యుదుత్పత్తికి 37,115 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 4.151, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 4.526 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలంలో ఎగువన 121.716, దిగువన 186.736 మిలియన్ యూనిట్లకు ఉత్పత్తి చేరిందని జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

పాలమూరు క్రికెట్ జట్టు హ్యాట్రిక్

అర్ధ శతకాలు సాధించిన అభిలాష్, అబ్దుల్ రాఫే, షాదాబ్

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-19 రాష్ట్రస్థాయి వన్డే టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు మెదక్‌పై గెలుపొంది హ్యాట్రిక్ సాధించింది. సోమవారం హన్మకొండలో నిర్వహించిన మూడో వన్డేలో మెదక్‌పై 90 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఉమ్మడి జిల్లా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. ముగ్గురు అర్ధ శతకాలతో ఆకట్టుకున్నారు. అభిలాష్ 66, అబ్దుల్ రాఫె 54, షాదాబ్ అహ్మద్ 53 పరుగులు చేశారు. అనంతరం లక్ష్య ఛేదనకు బరిలోకి దిగిన మెదక్ జట్టు 32.1 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. జిల్లా జట్టు నుంచి షాదాబ్ 4, అంకిత్ రాయ్, ముఖీత్ చెరో 2 వికెట్లు తీశారు. విజయం సాధించిన పాలమూరు జట్టును ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, శిక్షకుడు అబ్దుల్లా అభినందించారు.



విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టు



అవస్థలిలా.. చదువులు సాగేదెలా..!

వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 226 మంది చదువుకుంటున్నారు. వీరిలో 110 మంది విద్యార్థినులున్నారు. అందరికీ కలిపి పాఠశాల ఆవరణలో ఒక యూనిట్ మూత్రశాల మాత్రమే ఉంది. విద్యార్థినులు నిత్యం ఇలా బారులుదీరి నిరీక్షిస్తూ ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి అసౌకర్యాలతో చదువుపైనా శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. 116 మంది బాలురు ఆరుబయటకు వెళ్లాల్సిందే. 'మన ఊరు-మన బడి'లో మరో యూనిట్ మూత్రశాల మంజూరైనా నిర్మాణం చేపట్టలేదు. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ మాట్లాడుతూ ఇటీవల బదిలీపై వచ్చానని, సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. - న్యూస్‌టుడే, కొత్తకోట గ్రామీణం

బతుకమ్మ పాఠం.. చరిత్రకు అద్దం



బతుకమ్మలతో మహిళలు

కొత్తకోట, న్యూస్‌టుడే : తెలంగాణ పేరు చెప్పగానే గుర్తుకొచ్చేది బతుకమ్మ పండగ. ఇది దేశంలో అరుదైన పూల పండగ. ఏళ్ల క్రితమే మరుగున పడిన ఈ వేడుక.. రాష్ట్రం ఆవిర్భావం అనంతరం పూర్వ వైభవం సంతరించుకుంది. తొమ్మిది రోజుల పాటు మహిళలు ఎంతో ఇష్టంగా జరుపుకొంటారు. ప్రకృతిని ఆరాధిస్తూ సంప్రదాయబద్ధంగా జరిగే ఈ పండగ విశిష్టతను విద్యార్థి దశలోనే తెలిసేలా పాఠ్య పుస్తకాల్లో వీటిని చక్కగా వివరించారు. బుధవారం నుంచి జరుపుకొనే ఈ పండగ విశేషాలపై పాఠ్యపుస్తకాల్లో ఉన్న అంశాలపై 'న్యూస్‌టుడే' కథనం..

ఇది కథ..

బతుకమ్మ గురించి ఏడో తరగతి ఉపవాచకంలో 'మన పండగలు' పాఠ్యాంశంలో చక్కగా వివరించారు. 'చోళరాజు అయిన ధర్మాంగదునికి వందమంది కుమారులు సంతానం. వారంతా యుద్ధంలో మృతి చెందుతారు. చాలా కాలం తరువాత లక్ష్మీదేవి అనుగ్రహంతో ఓ ఆడపిల్ల పుడుతుంది. ఈ పాపకు బతుకమ్మ అని పేరు పెట్టి నిండానూరేళ్ల బతకాలని అందరూ ఆశీర్వదిస్తారు'. ఆ అమ్మాయే బతుకమ్మగా పూజలందుకుంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో దొరికే గునుగు చామంతి, తోక చామంతి, తంగేడు, కట్ల, పిట్టకాలి, ఎర్రగన్నేరు, రుద్రాక్ష, బీర గుమ్మడి, ముద్దబంతి వంటి రంగురంగుల పూలు సేకరించి చక్కగా పేర్చి పైన పసుపు ముద్దను నిలిపి గౌరీదేవిగా కొలుస్తారు. ప్రతి రోజూ సాయంత్రం ఆడుకొని చెరువులో నిమజ్జనం చేస్తారు.

రోజుకో తీరు..

తొమ్మిది రోజులు తొమ్మిది పేర్లతో బతుకమ్మను పిలిచి కొలుస్తారు. తొమ్మిది రకాల ఫలాలు సమర్పిస్తారు. ప్రతి రోజు ప్రత్యేకంగా ఫలహారం నైవేద్యంగా పెడతారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ, రెండో రోజు అటుకుల, మూడో రోజు ముద్దపప్పు, నాలుగో రోజు నానబియ్యం, ఐదో రోజు అట్ల బతుకమ్మను కొలుస్తారు. ఆరో రోజును అర్రెమి అంటారు. ఎవరి ఇళ్ల వద్ద వారే ఆటలాడుకుంటారు. ఏడో రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మగా పిలుస్తారు.

సద్దుల బతుకమ్మ ప్రత్యేకం

తొమ్మిదో రోజు దసరాకు ఒకటి, రెండు రోజుల ముందు సద్దుల బతుకమ్మను జరుపుకొంటారు. ఆరోజు కుటుంబ సభ్యులంతా ఇంట్లో ఉంటారు. బతుకమ్మను పెద్దగా పేర్చుకుంటారు. కొత్త దుస్తులు ధరిస్తారు. ఆడబిడ్డలను, బంధువులను పిలుచుకుంటారు. బతుకమ్మను ఎత్తుకొని సద్దులు తీసుకుని ఆడుకున్న తరువాత చెరువుకు వెళ్తారు. జొన్న, మక్కపిండి, బెల్లం, పెసరపిండి, నెయ్యితో చేసిన పదార్థాలు, సత్తుపిండి, దోసకాయ, పెసరపప్పు, బెల్లంతో సద్దులు తయారు చేస్తారు. చెరువు వద్ద బతుకమ్మలను దించి మరోసారి ఆడుకుని చెరువులోకి సాగనంపుతారు. అనంతరం తెచ్చిన సద్దులను ఒకరినొకరు పంచుకుంటారు.

ఆట, పాటల్లో సాహిత్యం

'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ అమ్మలక్కలు, ఆడపడుచులు ఎంతో ఇష్టంగా ఆటపాటలు లయబద్ధంగా ఆడి పాడుతుంటారు. ప్రతి పాటలోనూ గౌరమ్మనే ఆరాధిస్తారు. ఇందులో గొప్ప సాహిత్యం ఉంటుంది. ఎక్కువగా ఆడపిల్లల జీవితాలు, కష్టాలు, అత్తవారింట్లో ఎదుర్కొనే సమస్యలు పాటల రూపంలో బయటకు వస్తుంటాయి.

సంస్కృతి చాటి చెప్పేలా..

పాఠ్యపుస్తకాల్లో సంస్కృతి, సంప్రదాయాలు తెలిసేలా పాఠ్యాంశాలు ఎంతో అవసరం. వీటి వల్ల పాఠశాల దశలోనే విద్యార్థికి మన చరిత్ర తెలుస్తుంది. పండగ అంటే ఏదో కుటుంబ సభ్యులంతా కలిసి మంచి భోజనం చేయడం కాదని అందులో విశేషం ఉందని గ్రహిస్తారు. ఇలాంటి పాఠ్యాంశాలు నేటి తరానికి ఎంతో అవసరం.

- కోట్ల వనజాత, రచయిత్రి, మహబూబ్‌నగర్

అవయవదానంతో పలువురి జీవితాల్లో వెలుగు



చెన్నిపొళ్ల జయమ్మ

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ మహిళ గత వారం రోజులుగా మృత్యువుతో పోరాడి తుది శ్వాస విడిచే సమయంలో అవయవదానం చేసి పలువురి జీవితాల్లో వెలుగులు నింపింది. మక్తల్ శివాజీనగర్‌కు చెందిన చాకలి జయమ్మ గత మంగళవారం మాగనూరు మండలంలోని నల్లగట్టు మారెమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకునేందుకు ఆర్టీసీ బస్సులో వెళ్లింది. ఆలయం వద్ద బస్సు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడటంతో తలకు తీవ్ర గాయమయ్యింది. వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సలు చేశారు. అక్కడి నుంచి హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. బ్రెయిన్ డెడ్ అయ్యిందని అక్కడి వైద్యులు చెప్పారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు జయమ్మ భర్త లక్ష్మణ్, కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో వారు అంగీకరించారు. సరోజిని కంట ఆస్పత్రికి ఒకరికి కళ్లు అమర్చగా, పదోతరగతి విద్యార్థికి కిడ్నీ అమర్చారు. ఇతర అవయవాలు మరికొందరికి అమర్చుతామని ఆస్పత్రి వైద్యులు చెప్పారు. జయమ్మ మృతదేహాన్ని సోమవారం మక్తల్ తీసుకొచ్చారు. పట్టణ ప్రజలు కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తూ ఇంటి వరకు ఊరేగింపుగా మృతదేహంతోపాటు వెళ్లారు.

చోరీ కేసుల్లో నిందితులకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆదిరెడ్డి, ఎస్సై శివానందం, ముసుగులో నిందితులు

జడ్చర్ల, న్యూస్‌టుడే : కొన్ని రోజులుగా జడ్చర్ల పట్టణంలోని పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను జడ్చర్ల పోలీసులు సోమవారం పట్టుకుని రిమాండుకు తరలించారు. సీఐ ఆదిరెడ్డి, ఎస్సై శివానంద్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. జడ్చర్ల పట్టణంలోని ఎర్రగుట్ట వద్ద నివాసముండే చిట్యాల రవి, వేంకటేశ్వర కాలనీలో ఉండే లింగాల మహేశ్ కలిసి తాళం వేసిన ఇళ్లను గుర్తిస్తూ వాటిలో చోరీలకు పాల్పడుతున్నారు. వీరు జులై 30న పట్టణంలోని భవానీనగర్‌లోని వడ్ల గోపి, ఆగస్టు 19న మమతనగర్ సమీపంలో నరేంద్రసాగర్, గత నెల 14న తాలుకా క్లబ్ రోడ్డులోని హసల్ అలీలకు చెందిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. తాలుకా క్లబ్ రోడ్డులోని సీసీ కెమెరాల పుటేజీలో నిందితులు ఉన్నాయి. వారిని పట్టుకుని విచారించగా చోరీలు చేశామని ఒప్పుకొన్నారు. వారి నుంచి మూడు తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. నగదు మాత్రం లభించలేదు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన పోలీసు సిబ్బంది నర్సింహ, విష్ణులను ఈ సందర్భంగా సీఐ అభినందించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	110-00
రిటైల్	132-00
డ్రెస్డ్	191-00
స్కిన్‌లెస్	218-00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ.10 గం. నుంచి మ.1 వరకు

గద్వాల గ్రామీణం: 9052211532 అలంపూర్: 8008573916
అయిజ: 8008573922 అలంపూర్ పట్టణం: 8008573930

సమస్య: ఎద్దులగూడెం దగ్గర ప్రధాన రోడ్డు పక్కన చెత్త చెదారం, వ్యర్థాలు వేయడంతో తీవ్ర దుర్వాసన భరించలేకున్నాం. వీటిని తొలగించాలి. **-శివకుమార్, ప్రయాణికుడు.**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపి చెత్తను, వ్యర్థాలను తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. **-కిష్టన్న, పంచాయతీ కార్యదర్శి, చర్లగార్లపాడు.**

సమస్య: చేనేత కార్మికులకు ప్రభుత్వం అమలు చేసిన త్రిఫ్ట్ ఫండ్ పథకం గడువు ముగిసింది. ఖాతాల్లో జమ చేసిన నగదు కూడా ఎవరూ చెల్లించడంలేదు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. **- రాజు, రాజోలి**

పరిష్కారం: త్రిఫ్ట్ పథకానికి సంబంధించి ఆర్డీ-1, ఆర్డీ-2 ఖాతాల్లో జమ చేసిన నగదు వివరాలు బ్యాంకుల నుంచి తీసుకురావాలని ఇప్పటికే కార్మికులకు సూచించాం. వివరాలు సరి చూసి, బ్యాంకులకు ఫైలింగ్ లెటర్లు అందజేసిన వెంటనే నగదు అందేలా చూస్తాం. **- గోవిందయ్య, ఏడీ, గద్వాల**

- మల్దకల్, రాజోలి, న్యూస్‌టుడే

తెరపై ఈనాడు

గద్వాల - ఎస్‌వీఎస్ సినిమాస్: దేవర (రెండు స్క్రీన్లు), సత్యం సుందరం, **అయిజ:** శివసాయి: దేవర, భువనేశ్వర్: 100 కరోడ్స్, మాధవ్: సత్యం సుందరం

- న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం, అయిజ



పుష్పగుచ్ఛం అందజేస్తున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి

వంతెన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించండి

ఇటిక్యాల, న్యూస్‌టుడే: వంతెన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌ను కోరారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి మండలంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఇటిక్యాల లక్ష్మమ్మ చెరువు కింద బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందని అలాగే మునుగాల శివారులోని జూరాల ప్రధాన కాలువపై మరో బ్రిడ్జిని నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగిని విధుల్లోకి తీసుకోవాలని నిరసన



నిరసనలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, టోల్‌ప్లాజా ఉద్యోగులు, కార్మికులు

ఉండవల్లి, న్యూస్‌టుడే: మండల పరిధి పుల్లూరు శివారులోని టోల్‌ప్లాజాలో తొలగించిన ఉద్యోగిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని టోల్‌ప్లాజా కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. టోల్‌ప్లాజా ఉద్యోగి హుస్సేన్‌బాషాను యాజమాన్యం అకారణంగా విధుల నుంచి తొలగించారని, నెల రోజుల్లోగా తిరిగి విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. తొలగించిన ఉద్యోగిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో టోల్‌ప్లాజా యాజమాన్యానికి లేఖ అందజేశామని తెలిపారు. యాజమాన్యం స్పందించకపోవడంతో ఉద్యోగులంతా నిరసన కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పీటరు, ప్రధాన కార్యదర్శి మద్దయ్య, చిన్న నరసింహులు, రాజశేఖర్, వెంకటేష్, లాజర్, వెంకట్‌రాముడు, తదితరులు పాల్గొన్నారు.

సోదరభావంతో మెలగాలి

వడ్డేపల్లి, న్యూస్‌టుడే : కులమతాలకు అతీతంగా ప్రజలంతా కలిసి ఉండాలని తహసీల్దార్ ప్రభాకర్ అన్నారు. సోమవారం కొయిలదిన్నెలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలంతా సోదరభావంతో ఉండాలన్నారు.

మల్దకల్, న్యూస్‌టుడే: గ్రామంలో అన్ని కులాల వారు కలిసి మెలిసి సోదర భావంతో మెలగాలని ఆర్డై నాగిరెడ్డి సూచించారు. సోమవారం అమరవాయి గ్రామపంచాయతీ కార్యాలయంలో పౌరహక్కుల దినం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో అంటరానితనం , రెండు గ్లాసుల పద్ధతి, ఆలయ ప్రవేశం అడ్డుకోవడం మొదలైన చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

మల్దకల్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ నాగేశ్వరరెడ్డి హెచ్చరించారు. సోమవారం రాత్రి మల్దకల్ మండలం మద్దలబండలో ఎస్సై నందికర్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్, గ్రామసభ నిర్వహించి మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోరాదని సూచించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి 70 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని వాటికి సరైన పత్రాలు సమర్పిస్తే యజమానులకు తిరిగి అప్పగిస్తామని పేర్కొన్నారు. 8 మంది ఎస్సైలు, 5 గురు ఏఎస్సైలు, 39మంది పోలీసులు పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట చెత్త తొలగింపు

మల్దకల్, న్యూస్‌టుడే: మల్దకల్ జడ్పీ ఉన్నత పాఠశాల ఎదుట చెత్తకుండీలు నిండి వ్యర్థాలు కిందపడ్డాయి. దుర్వాసన భరించలేని విధంగా మారడంతో మేమున్నాం మీకు తోడుగా శీర్షికతో 27న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి పంచాయతీ కార్యదర్శి తిరులమయ్య స్పందించి చెత్త కుండీలను శుభ్రం చేయించి చెత్త తొలగించి పరిసరాలను శుభ్రంగా మార్చడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆలయ భూముల అన్యాక్రాంతంపై ఫిర్యాదు



వినతి పత్రం అందజేస్తున్న భాజపా నాయకులు

వడ్డేపల్లి, న్యూస్‌టుడే : జూలేకల్ గ్రామ ఈశ్వరస్వామి దేవాలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని భాజపా నాయకులు సోమవారం వడ్డేపల్లి తహసీల్దార్ ప్రభాకర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం సాగు చేస్తున్న వారు ఆ భూములను విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై ఇటీవలే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. వెంటనే కలెక్టర్ చర్యలు తీసుకొని నిషేధిత జాబితాలో చేర్చుతామని చెప్పారన్నారు. అవి నిషేధిత భూముల జాబితాలో ఉన్నాయని, ఎవరూ ఆ పొలాలను కొనడానికి, అమ్మడానికి వీలులేదని తహసీల్దార్ ప్రభాకర్ తెలిపారు. భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, మండలశాఖ అధ్యక్షుడు నర్సింహుడు, బీజేవైఎం మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్లుయాదవ్, ఆంజనేయులుగౌడ్, ఆర్‌కేనాయుడు పాల్గొన్నారు.

లడ్డూ కల్తీలో దోషులను శిక్షించాలి



గద్వాల: ర్యాలీలో శ్రీవారి చిత్రపటంతో పుర ఛైర్మన్, తదితరులు



శాంతినగర్: వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ, భాజపా నాయకులు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: శ్రీవారి భక్తులు పరమపవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపి అపవిత్రం చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీశారని పుర ఛైర్మన్ కేశవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి లడ్డూ కల్తీపై హిందూ సంఘాలు నిరసన ర్యాలీని చేపట్టాయి. ఈ ర్యాలీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయం నుంచి ఐడీఓసీ వరకు కొనసాగింది. ర్యాలీకి పలు సంఘాలు సంఘీభావం ప్రకటించి ర్యాలీలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా వివిధ సంఘాలు, రాజకీయ పక్షాల నాయకులు మాట్లాడారు. లడ్డూ ప్రసాదం తయారీని అపవిత్రం చేయడంతో పాటు ఆలయంలో అన్యమస్థుల వారిని ఉద్యోగులు నియమిస్తుండటంతో వారు ఆలయ సంప్రదాయాలను కలుషితం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం లడ్డూ కల్తీకి పాల్పడిన వారిని శిక్షించాలని కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఫణిమోహన్‌రావు, విజయ్‌కుమార్, జగదీశ్వర్‌రెడ్డి, ఈశ్వరయ్య, భాజపా నాయకులు రామచంద్రారెడ్డి, బండల వెంకట్రాములు, కిరణ్, మోహన్‌రెడ్డి పవన్, సాయి, సుధాకర్ శ్రీకాంత్ తదితరులున్నారు.

శాంతినగర్, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ అపవిత్రం ఆరోపణలపైన పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని శాంతినగర్‌లో సోమవారం వీహెచ్‌పీ మండల కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వీహెచ్‌పీ, భాజపా నాయకులు మారుతీనగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ద్విచక్రవాహనాలపై ర్యాలీ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్, మధుసూదన్‌గౌడ్, నర్సింహులు, రామకృష్ణ, విజయ్, సప్తగిరి శ్రీను, తేజ, తిమ్మప్ప, పాల్గొన్నారు.

రాజోలి, న్యూస్‌టుడే : తిరుమల లడ్డూ కల్తీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ సోమవారం భాజపా నాయకులు తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులంతా కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. దేవాలయాల పవిత్రతతో అన్యాక్రాంతమైన భూమిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, మల్లేశ్, రాజశేఖర్, తిరుమలేశ్, ఆదిస్వామి, గోవిందరాజులు, శశికుమార్, సునీల్ తదితరులున్నారు.



రాజోలి : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న భాజపా నాయకులు

మానవపాడు, న్యూస్‌టుడే : విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం మానవపాడులో వీహెచ్‌పీ ప్రతినిధులు, భాజపా నాయకులు స్థానిక ఆంజనేయస్వామి ఆలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. తిరుపతి లడ్డూ వివాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రఘు, మురళీకృష్ణ, నాగరాజు, శేఖర్, వీరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గట్టు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని గ్రామ స్వరాజ్యం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజు విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గాంధీ జయంతి రోజున బహుమతులను ప్రదానం చేస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ జట్ల ఎంపిక

ధన్వాడ, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ జట్ల ఎంపిక కల్లు ఎస్‌జీఎఫ్ అధికారులు పూర్తి చేశారు. 14 ఏళ్లలోపు బాలికల విభాగంలో 30 నుంచి 62 కిలోల బరువు పరిధిలో నందిని, నిఖిత, సీతామహలక్ష్మి, శిరీష, ప్రియమాణి, మౌనిక, గంగమ్మ, కీర్తి ఎంపికయ్యారు. 17 ఏళ్ల విభాగంలో నేహశ్రీ, శిరీష, జె.శిరీష, బాలమణి, జగదీశ్వరి, శివరంజని, సుప్రియ, సోనమ్మలు ఉన్నారు. 19 ఏళ్ల విభాగానికి సంబంధించి 50 నుంచి 53 కిలోల బరువు పరిధిలో గీతా, రజిత, గీత, సాయి వైష్ణవి ఎంపికయ్యారు. బాలుర 14 ఏళ్ల విభాగంలో 35 నుంచి 68 కిలోల పరిధిలో అఖిల్, రాకేష్, కుమార్, ప్రవీణ్, నరేందర్, జగన్ నాయక్, రోషన్, అరవింద్ వెంకటేష్‌లు ఎంపిక కాగా 17 ఏళ్ల విభాగంలో భాను, రాజేష్, నందు, మధు, మహేష్, ప్రవీణ్‌నాయక్, గిరి ఎంపికయ్యారు. 19 ఏళ్ల విభాగంలో జె.అరుణ్, చరణ్‌నాయక్, పవన్, ముకుందలు ఎంపికయ్యారు.

పుర కార్మిక సిబ్బందికి సహపంక్తి భోజనాలు

అలంపూర్, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం అలంపూర్ పురపాలిక పారిశుద్ధ్య కార్మికులకు సాహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. గాంధీ చౌక్ నుంచి తుంగభద్ర వంతెన వరకు 2కే రన్ నిర్వహించారు. కౌన్సిలర్ పుష్పలత, సిబ్బంది వార్డు, అధికారులు పాల్గొన్నారు

విద్యాలయాల్లో బతుకమ్మ సందడి



గట్టు కేజీబీవీలో బతుకమ్మలతో విద్యార్థినులు

గట్టు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో సోమవారం విద్యార్థినులు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో బతుకమ్మను తయారు చేసి పూజలు చేశారు. అనంతరం ఉల్లాసంగా బతుకమ్మ ఆడారు. సాయంత్రం బతుకమ్మను భవానీమాత పుష్కరిణిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓ గుంటి గోపీలత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గద్వాల గ్రామీణం : గద్వాల మండలం గోనుపాడులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో పాటు అధ్యాపక సిబ్బంది బతుకమ్మల చుట్టూ ఆడిపాడి సందడి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామ్మోహన్, సిబ్బంది సుధారాణి, ఈదన్న తదితరులు పాల్గొన్నారు.



పాలిటెక్నిక్ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు

జిల్లాస్థాయి పోటీల్లో బోనఫైడ్ ధ్రువపత్రాల గందరగోళం

అలంపూర్, ఉండవల్లి, న్యూస్‌టుడే: ఉండవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పరిధిలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని 12 మండలాల నుంచి అండర్-14, -17 ఆడేందుకు ప్రతి మండలం నుంచి రెండు జట్లకు సంబంధించిన విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల వయసులో తేడా రావడంతో కొన్ని జట్ల మధ్య వాదోపవాదాలు నెలకొన్నాయి. దీంతో పీఈటీలు, పీడీలు విద్యార్థుల బోనఫైడ్ సర్టిఫికెట్లను పరిశీలించే పరిస్థితి ఏర్పడింది. అండర్-14 పరిధిలో 6 నుంచి 8వ తరగతి వరకు (పుట్టిన సంవత్సరం 2011), అండర్-17లో 9వ తరగతి నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం వరకు (పుట్టిన సంవత్సరం 2010). అండర్-14 పరిధిలో రాజోలి, కేటీదొడ్డి జట్ల మధ్య గందరగోళం ఏర్పడటంతో బోనఫైడ్ సర్టిఫికెట్లను పరిశీలించే పరిస్థితి ఏర్పడింది. పరిశీలనలో కొందరు విద్యార్థులకు అనుమతి కల్పించలేదు. తప్పుడు సర్టిఫికెట్లను తీసుకొచ్చి క్రీడలు ఆడటం వల్ల నిజమైన విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని పీఈటీలు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.



విద్యార్థుల బోనఫైడ్ ధ్రువపత్రాల పరిశీలన

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మల్దకల్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యా నైపుణ్యాలను బోధిస్తూ అక్షరమాల, వర్ణమాల అంకెలు నేర్పించాలని ఐసీడీఎస్ సీడీపీవో నాగరాణి సూచించారు. పోషణ మాసం కార్యక్రమాలు విజయవంతం కావడానికి అందరి సహకారం అవసరమన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రాజెక్ట్ స్థాయి మల్దకల్, గట్టు, అయిజ మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అన్నప్రాశన నిర్వహించి పోషణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు యామిని, సంధ్యారాణి, వాసంతి, తెల్లమ్మ, వెంకటేశ్వరమ్మ, శశికళ పాల్గొన్నారు.

మానవపాడు, న్యూస్‌టుడే : అంగన్‌వాడీల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ మండల పర్యవేక్షకురాలు లక్ష్మి అన్నారు. పోషణ మాసం పురస్కరించుకొని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. కేంద్రాలకు వచ్చే పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చూడాలన్నారు. పోషణ లోపంతో బాధపడకుండా అదనపు పౌష్టికాహారం అందించాలని టీచర్లకు సూచించారు. పోషణమాసం సందర్భంగా ప్రత్యేకంగా తయారుచేసిన తినుబండారాలను ప్రదర్శించారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో నాగరాణి

నడిగడ్డలో మత్తు పదార్థాలు తరిమికొడదాం



నాయకులతో కలిసి ఒక్క రోజు నిరాహార దీక్ష చేపట్టిన నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: నడిగడ్డలో గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలను తరిమికొడదామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం గద్వాలలోని పాతబస్టాండ్ వద్ద మత్తు పదార్థాల బహిష్కరణకు ఆయన నాయకులతో కలసి ఒక్క రోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడిగడ్డ ప్రాంతంలో యథేచ్ఛగా నిషేధిత డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు రాజ్యమేలుతున్నాయని వాటిని అరికట్టే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. చాలా చోట్ల గ్రామాల్లో కల్తీ కల్లులో అల్ప్రాజోలం, సీహెచ్, డైజోఫాం వంటి పదార్థాలను కలుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల వాడకం ద్వారా విచక్షణ రహిత్యాన్ని కోల్పోతారని వివరించారు. దీంతో ఉన్మాదిగా మారి అఘాయిత్యాలకు పాల్పడటంతో పాటు అసాంఘిక కార్యక్రమాలు పాల్పడటంతో మహిళలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయని తెలిపారు. నిన్న మొన్నటి వరకు జిల్లాలో చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొందన్నారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ దీక్షకు సీపీఐ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, భాజపా జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములు, చిత్తారి కిరణ్, విశ్వహిందూ పరిషత్ నుంచి ఎర్ర జనార్దన్, భారాస నాయకులు సునంద్, మహమ్మద్ రఫీలు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పోరాట సమితి నాయకులు రంగస్వామి, వెంకట్రాములు, లవన్న, శ్రీనివాస్‌యాదవ్, నాగరాజు, ఇంతియాజ్, గోపాల్, విష్ణు, ప్రేమ్‌రాజ్, నజూముల్లా, తిమ్మప్ప, గోవిందు పాల్గొన్నారు.



ముస్తాబైన అమ్మవారి ఆలయం



మూలవిరాట్

నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

వడ్డేపల్లి, న్యూస్‌టుడే : దసరా నవరాత్రి ఉత్సవాలకు శాంతినగర్ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. తొమ్మిది రోజులు వివిధ రూపాల్లో అలంకరించి విశేష పూజలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 3 నుంచి 12 వరకు జరిగే కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరవనున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా వసతులను కల్పిస్తున్నారు. ఆలయ పరిసరాలు శుభ్రం చేయించి దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. ● ప్రతి రోజు ఉదయం 8 గంటలకు ఒకసారి అభిషేకం, ఉదయం 11 గంటలు, సాయంత్రం ఆరు గంటలకు కుంకుమార్చనలు చేస్తారు. అమ్మవారి భక్తిగీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిత్యం ఉంటాయి.

ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

మల్దకల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాల మిద్దెపై నుంచి వచ్చే వర్షపు నీటిని సామూహిక ఇంకుడు గుంతలోకి మళ్లించి ఇంకే విధంగా చూస్తే ఎన్నో లాభాలున్నాయని, ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని ఏపీవో సుజాత సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సామూహిక ఇంకుడు గుంతను పరిశీలించారు. మండలానికి ఏడు సామూహిక ఇంకుడు గుంతలు మంజూరు కాగా రెండు పూర్తయినట్లు వెల్లడించారు. ఒక ఇంకుడు గుంతకు రూ.25వేల నిధులు మంజూరైనట్లు వివరించారు. మల్దకల్2- తాటికుంట, విఠలాపురం, అమరవాయి, మద్దలబండ, పాలవాయి గ్రామాలకు ఒక్కొక్కటి చొప్పున మంజూరైనట్లు చెప్పారు. మిగిలిన వాటిని త్వరలో పూర్తి చేయించాలని టీఏని ఆదేశించారు. టీఏ అనూష, ఈసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ఉండవల్లి, న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్, ఉండవల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత అన్నారు. ఉండవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు అండర్ -14, 17 విభాగంలో బాలురకు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 2 విభాగాల్లో కలిపి 24 జట్లు పోటీలకు హాజరయ్యారు. కబడ్డీలో అండర్ 14 విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన గద్వాల, కేటీదొడ్డి.. అండర్ -17 విభాగంలో కేటీదొడ్డి, ధరూరు జట్లకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా స్థాయిలో రాణించిన కబడ్డీ జట్లు జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం హేమలత తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో అధికారి ఆనంద్, రాజోలి మండల విద్యాధికారి భగీరథరెడ్డి, ఉండవల్లి మాజీ సర్పంచి రేఖ, వ్యాయామ ఉపాధ్యాయులు భరత్‌కుమార్, శైలజ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

మార్కెట్‌యార్డు అభివృద్ధికి సహకరించండి

ఉండవల్లి, న్యూస్‌టుడే : అలంపూర్ వ్యవసాయ మార్కెట్‌యార్డు అభివృద్ధికి సహకరించాలని హైదరాబాదులో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో డైరెక్టర్ లక్ష్మీబాయిని అలంపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఉప్పరి దొడ్డెన్న, వైస్ ఛైర్మన్ పచ్చర్ల కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మార్కెట్‌యార్డు అభివృద్ధికి సహకరించాలని డైరెక్టర్‌ను కోరడంతో ఆమె సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

గట్టు, న్యూస్‌టుడే: మండలంలోని గొర్లఖాన్‌దొడ్డి, తప్పెట్లమొర్సు రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కర్ణాటక వాసి చిన్న (30) కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. రాజోలి మండలం తుమ్మిళ్ల గ్రామానికి చెందిన మల్లికార్జున్ తన ద్విచక్రవాహనంపై వేగంగా వచ్చి చిన్న నడుపుతున్న వాహనాన్ని ఢీకొట్టడం వల్లే ఆయన మృతి చెందాడని బాధితుడి మామ తాయప్ప సోమవారం ఠాణాలో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కేటీ.మల్లేశ్ తెలిపారు.

వ్యక్తి అస్థిపంజరం లభ్యం

ఉండవల్లి, న్యూస్‌టుడే : మండలపరిధి పుల్లూరు గ్రామ శివారులో పొలం వద్ద కుళ్లిన స్థితిలో ఉన్న అస్థిపంజరం లభ్యమైంది. ఎస్సై మహేష్ వివరాల ప్రకారం.. పుల్లూరు శివారులోని పొలం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పొలం దున్నేందుకు వచ్చిన కౌలురైతు గమనించి ఉండవల్లి ఠాణాకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కుళ్లిపోయిన స్థితిలోని (అస్థిపంజరం) గుర్తించారు. చనిపోయి నెల రోజులై ఉండొచ్చని, మృతదేహంపై నలుపు, గోదుమ రంగులోని 2 ప్యాంట్లు, నీలిరంగులో షర్టు, చెప్పులు ధరించి ఉన్నట్లు తెలిపారు. పుల్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదుతో ఎస్సై మహేష్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అత్యాచారం ఘటనలో కేసు నమోదు

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: ఓ వివాహితపై అత్యాచారం చేసిన వ్యక్తిపై గద్వాల గ్రామీణ ఠాణాలో కేసు నమోదైంది. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం... గద్వాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత (35) ఈ నెల 26 తన ఇంటి కంపౌండ్‌లో నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన బీరప్ప అనే వ్యక్తి ఆ వివాహిత భర్త వేరే ఊరికి వెళ్లాడని తెలుసుకుని ఆమెపై అర్ధరాత్రి సమయంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. ప్రతిఘటించిన అఘాయిత్యానికి పాల్పడినట్టు బాధితురాలు సోమవారం తన భర్త సహకారంతో గద్వాల గ్రామీణ ఠాణాలో ఫిర్యాదు చేసింది. గతంలో కూడా తనపై అత్యాచార యత్నానికి ఒడిగట్టాడని, పెద్దలు హెచ్చరించినా మార్పు రాలేదని ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలు ఫిర్యాదు మేరకు బీరప్పపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ చెప్పారు.

క్రైం కార్నర్

మూడుచోట్ల చోరీలు

ధరూరు న్యూస్‌టుడే: కేటిదొడ్డి మండలంలో యర్సన్‌దొడ్డి గ్రామంలో పట్టపగలే నాలుగు ఇళ్లలో చోరీకి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం ఇళ్ల వద్ద ఎవరు లేని విషయం గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు వరుసగా ఉన్న నాలుగు ఇళ్ల తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారం, నగదు చోరీ చేశారు. మొత్తం రూ.1.63 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదు అపహరించినట్లు బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

ఉండవల్లి, న్యూస్‌టుడే : టీ దుకాణంలో వరుసగా రెండు పర్యాయాలు చోరీ జరిగిన సంఘటన మండల పరిధి అలంపూర్ చౌరస్తాలో చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. అలంపూర్ మండలంలోని లింగనవాయి గ్రామానికి చెందిన సలీం అలంపూర్ చౌరస్తాలో టీ దుకాణం నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 26న దుకాణం బంద్ చేసి ఇంటికి వెళ్లారు. 27న వచ్చి చూడగా రూ.3 వేల విలువైన సిగరెట్లు, కూల్‌డ్రింక్స్ చోరీ జరిగినట్లు పేర్కొన్నారు. పోలీసుల సూచన మేరకు 28న సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శనివారం దుకాణం బంద్ చేసి ఇంటికి వెళ్లి సోమవారం వచ్చి చూశాడు. మరోసారి గుర్తు తెలియని వ్యక్తి దుకాణం పైకప్పు తెరచి రూ.1,500 విలువైన సిగరెట్లు దొంగతనం చేసినట్లు సీసీ కెమెరాలో నిక్షిప్తం అయినట్లు తెలిపారు. అలాగే 3 నెలల కిందట అదే దుకాణంలో చోరీ జరిగినట్లు తెలిపారు.

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: గద్వాల పుర పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో ఓ కిరాణా దుకాణంలో చోరీ జరిగింది. గద్వాల పట్టణ ఎస్సై కల్యాణ్‌కుమార్ కథనం ప్రకారం.. కాలనీకి చెందిన చింతలయ్య కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి దుకాణం మూసి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం దుకాణం తెరిచి ఉన్నట్లు కొందరు సమాచారం ఇవ్వడంతో చింతలయ్య దుకాణం వద్దకు వెళ్లి పరిశీలించాడు. దుకాణంలో ఉన్న రూ. 24 వేల నగదుతో పాటు 6 వేల విలువ గల వస్తువులు అపహరించినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.